# నివేదన

ప్రియ న్యాయమూర్తులకు.....

నా జననం ఎలా జరిగిందో తెలిపే జనం అంటూ నాకెవరూ లేరుగానీ అనాధ శరణాలయపు పసి జీవితంలో నే ననుభవించిన కష్టాలు మాత్రం నాకు నేనుగా వెల్లడి చేసుకోగలను. పేరుకు తగినట్టుగానే అనాధలకు ఏం జరిగినా అడిగే దిక్కులేని శరణాలయంలో వార్డెన్లు మాచేత తమ బట్టలుతికించడం దగ్గర్నుంచి తమ స్నానాలకు నీళ్లు తోడించడం వరకూ రకరకాలుగా వెట్టిచాకిరీ చేయిస్తూ.... వివిధ పనులతో అలసి సొలసే మాకు వేళ దాటిపోయాక పాచిపోయిన అన్నం అదీ చాలీ చాలకుండా పెట్టడం.....మేం తినమని మొరాయిస్తే చేయవలసిన చాకిరీ రెట్టింపు చేయడంతో పాటూ ముక్కుపచ్చలారని మాపై ముష్టిఘాతాలు ప్రయోగించడం....వంటి అనేక సంఘటనలు ఇంకా నా మదిలో మెదులుతూనే ఉన్నాయ్!

అందరికీ బాల్యం వసంతంలా గడిస్తే నా జీవితంలో మాత్రం పద్దెనిమిది వత్సరాలూ గ్రీష్మాలుగానే గడిచాయ్! పక్వానికొచ్చిన గున్నమావి ఫలంలా సరైన పరువంతో నిండిన చక్కటి నా అందానికి ఆకర్షితుడైన ఓ వ్యక్తి నా శరీరంపై తన మదిలో రేగిన కామపు ప్రేరణే ప్రేమగా భ్రమించాడో అలా నన్ను నమ్మించాడో తెలియదు కానీ నా భావి జీవితమంతా అతని సాన్నిహిత్యంతో గొప్ప ఆనందమయపు కేళిలా అనిపించేది నాకు!

అయితే ఆనాడు అతని ప్రేమ ఓ వికసిత కుసుమంపై గండు తుమ్మెద కుండే భావన లాంటిదని గ్రహించలేకపోయాన్నేను!

ఏకాంతంగా అతడు నన్ను కలసిన ప్రతిసారి తన శారీరక వాంఛను తీర్చుకోవడానికై పలువిధాల బలవంతం చేసేవాడు. అయితే పెళ్లికి మునుపే అతనితో సాంగత్యానికి నే నొప్పుకోకపోవడంతో చివరికి నా చదువు పూర్తయిన వెంటనే హాస్టల్ అధికారులతో మాట్లాడి పెళ్లికి ముహూర్తం పెట్టించాడు. అతని ఆదర్శానికి హాస్టల్ వార్డెన్లతో సహా పలువురు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ఆ క్షణం అతడు నా కళ్లెదుట ప్రత్యక్షమైన భగవంతుడిలా అగుపించాడు!

ఏ ఆర్భాటాలూ లేకుండా ఓ పసుపు తాడుతో మా వివాహం జరిగిపోయింది!

కానీ ఆ పెళ్లి బలి పశువుకు చేసే అలంకారం వంటిదని గానీ - మా కాపురం చిరుగాలికి కూలిపోయే పేకమేడ లాంటిదని గానీ - అప్పట్లో నా కర్థమయింది కాదు!

సరిగ్గా మా పెళ్లయిన రెండు నెలల తరువాత అనుకుంటా -

ఆరోజు తన మిత్రుడింట్లో ఫంక్షనుందని చెప్పి నన్ను తన వెంట తీసుకెళ్లిన అతడు పార్టీలో నన్ను మరో వ్యక్తికి అప్పగించి తాను మద్యపానపు మత్తులో మునిగిపోయాడు. ఆ రాత్రి ఆ వ్యక్తి నాపై తన పశుబలాన్ని ప్రయోగించి బాల్యపు నరకాన్ని మరోసారి గుర్తుకు తెచ్చాడు.

అంతవరకూ సంసారం పేరుతో నా 'భర్త' అనబడే ఓ మగాడితో నేను చేస్తున్నది పచ్చి వ్యభిచారమేననీ - కేవలం నా శరీరంపై మోజుతోనూ, అంతకు మించి తన వ్యసనాలకు గానూ, పెట్టుబడిగా ఉపయోగించుకునే ఉద్దేశ్యంతోనూ మాత్రమే నన్ను వంచించి పెళ్లి పేరుతో స్వంతం చేసుకున్నాడనీ అప్పటికి గానీ గ్రహించలేకపోయాన్నేను!

ఆ మరునాడే నా భర్తను విడిచి వెళ్లిపోవడానికి నేను చేసిన ప్రయత్నాన్ని పసిగట్టిన అతడు ఆరోజే నన్ను బ్రోతల్ హౌస్‌కు అమ్ముకోవడం ద్వారా తరలించి చేతులు దులుపుకున్నాడు.

అక్కడ మరికొన్ని రోజులు ప్రత్యక్ష నరకాన్ని (మూడోసారి) అనుభవిస్తూ ఓ స్నేహితురాలి సాయంతో అతి కష్టం మీద అక్కడినుంచి బయటపడి నా జీవితానికి పూర్తి స్వాతంత్ర్యం కోరుకునే ఉద్దేశ్యంతో ఆనాడే ఆ ఊరు వదిలి పెట్టాన్నేను!

కాని అలా పులిబోనులోంచి బయటపడిన నేను నాగరిక సమాజమనే సింహపు దంష్ట్రల మధ్య బందీనవుతాననీ - అది మరింత ప్రాణాంతకమనీ ఆ క్షణమే నే ఊహించగలిగుంటే అక్కడే ఆత్మాహుతి చేసుకునుండేదాన్నేమో?!

తెగిన గాలిపటంలాగో....రెక్కలు తెగిన పక్షిలాగో ఎక్కడెక్కడో తిరిగి చివరికి ఓ మధ్య తరగతి కుటుంబంలో పనిమనిషిగా చేరగలిగాను. మొదట్లో అక్కడ నన్నెవరూ పట్టించుకున్న పాపాన పోకపోయినా ముందూ వెనుకా ఎవరూ లేని అనాధనని అందరికీ తెలియడం వల్లనో....కృంగి కృశించిన దేహం రెండు వారాల్లోనే కడిగిన ముత్యంలా ప్రకాశించడంతో ఇట్టే ఆకర్షించుకోగల నా అందానికీ, పట్టు సడలని నా పరువానికీ (ఆ రెండూ స్త్రీల పాలిట శాపాలని నాకైతే తెలిసింది కాదు) ఆ ఇంట్లోని మగవాళ్లతోబాటూ ఆ వీధిలోని మగవెధవలంతా నావైపు ఆకలిగొన్న పులుల్లా చూడటం గమనించాన్నేను.

నేను పనిజేస్తున్న ఇంటి యజమానికి అరవై పైబడినా "నెరసిన జుట్టు వయస్సుకు చిహ్నం కానీ విజ్ఞానానికి కాదు...." అన్న వాక్యానికి అతికిపోయేలా ప్రవర్తించేవాడు. అతని ఇద్దరి కొడుకుల్లో పెద్దవాడైన పెదబాబు కళ్లెప్పుడూ నా శరీరపు అంగాంగాలనూ రకరకాల కోణాల్లో శోధిస్తూండేవి!

పెళ్లై రెండు సంవత్సరాలు పైబడినా ఇంకా పెళ్లాన్ని సుఖపెట్టడం చాతకాని పెదబాబు (ఆ విషయాన్ని గూర్చి అతని భార్య బయటకు వెళ్లగక్కలేక.... మనసులో దాచుకోలేక పలుమార్లు దుఃఖంతో సతమతం కావడం తెలుసు నాకు) నా పరిస్థితిపై కసాయి ప్రేమనూ, జాలినీ నటిస్తుంటే అసహ్యమేసేది నాకు! ఒక్కోసారి అతని వెకిలి వేషాలెక్కువౌతుండేవి. అలాం


శౌక శ్రీనివాసరావు



టపుడు "ముందు నీ పెళ్లాన్ని సుఖపెట్టడం నేర్చుకోరా ఆడంగి వెధవా" అని అరవాలనిపించేది నాకు. కానీ ఆవిషయాన్ని బయటపెట్టిందన్న నెపంతో అతని భార్యను మరింత హింసిస్తాడేమో అన్న సందేహం నా నోరు నొక్కేసేది!

ఇక చినబాబు విషయానికొస్తే ఆయన తీరే వేరు. బహుశా ఒక మనిషి వ్యక్తిత్వాన్నీ, ప్రవర్తననూ, ఆలోచనలనూ, పరిగణనలోనికి తీసుకుని వాటినిబట్టే ఆవరి వ్యక్తికి గౌరవాన్నీ, విలువనూ ఇచ్చి మాట్లాడే అరుదైన వ్యక్తిత్వం అతనిలోనే మొట్టమొదటిసారిగా గమనించానేమో నేను!

ఎన్నడూ కనిపించకపోయినా, ఎన్నిసార్లు వేడుకున్నా ఏ విధంగానూ ఆదుకోకపోయినా ఆ భగవంతునిపై నాకెంత గౌరవముందో అంతకుమించిన గౌరవం చినబాబుపై నాకు కలుగసాగింది. క్రమంగా ఆ గౌరవం అభిమానంగా మారి ఆయన నాపట్ల చూపుతున్న ఆదరానికి ఉక్కిరిబిక్కిరయ్యేదాన్ని నేను!



ఎప్పుడైనా పనిపడి వీధిలోనికెళితే అడ్డమైన వెధవలూ (అంటే సంపాదనంతా జూదమాడటానికో, మద్యపానం సేవించడానికో, వ్యభిచరించడానికో తగలేసి తనపై ఆధారపడిన కుటుంబాన్ని ఆకలిపాలు చేస్తూ తిరిగే ప్రబుద్ధులూ... ఉద్యోగాల వేటలో అలసిపోయి నావంటి నిస్సహాయ స్త్రీల వెంటపడి వేధిస్తూ అల్పానందాన్ని పొందే బాధ్యతతెరుగని యువకులూ...స్త్రీలను చిన్నచూపు చూసే మగవాళ్లంతా....) నా శరీరపు అంగాంగాలనూ నగ్నంగా దర్శించాలనే తపనతో....వీలుకాక తమ కామపు తమకాన్ని నన్ను తమ తీక్షణమైన చూపులతో స్పర్శిస్తూ తమకు నచ్చిన రీతిలో ఊహించుకుంటూ తృప్తిచెందే (కంటికింపుగా కనిపించే ఏ పరస్త్రీ కంటపడినా ఇదే తంతు) ఈ సూడో మెంటాలిటీ మగవాళ్లంతా "యత్ర నార్యస్తు పూజ్యంతే రమేంతే తత్ర దేవతాః" అని ఘోషించే పురాణాలు కలిగిన మన భారతదేశపు సంస్కృతీ సంప్రదాయాలే ఊపిరిగా పెరిగిన పౌరులే కావడం ఎవరి దురదృష్టం?

శారీరక వ్యభిచారం కంటే మానసిక వ్యభిచారం ఘోరమైన నీచాతి నీచమైన దనే అన్న నగ్నసత్యం తెలియని దెవరికి?! అయినా-

మనం ముద్దుగా పిలుచుకునే మన పవిత్ర భారతదేశంలోనే - డేటింగ్‌లూ, స్వేచ్ఛా విహారాలూ, అమలులో ఉన్న పాశ్చాత్య దేశాల్లో కంటే 'మానసిక వ్యభిచారం' అతి ఎక్కువ శాతంలో ఉందంటే కారణం ఏమిటి? లోప మెక్కడుంది? ప్రస్తుతం నా వయసు పాతికైనా నిండలేదేమో? అయినా -

ఇన్ని సంవత్సరాల వయసులో ఓ సాధారణ సగటు ఆడపిల్ల తన జీవితంలో అనుభవించే ఏ చిన్న మధురానుభూతికీ నోచుకోలేకపోయిన నేను ఇకపైన అయినా అనుభవించగలనన్న ఆశ ఏకోశాన నాలో మిగల్లేదు!

నే చదివిన చదువు నాలో విజ్ఞానాన్ని పెంచిందో లేదో తెలియదు కానీ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంలోనూ మనసులోని భావాలను బయటపెట్టుకోవడంలోనూ ఉపకారిగా ఉందన్నమాట వాస్తవం!

నిన్ననే నాకోవిషయం తెలిసింది! అది-
స్త్రీ జీవితానికి సంపూర్ణార్థాన్ని కల్పించి సార్థకతను చేకూర్చే విషయం! కానీ -

వసంత మాసాగమనాన్ని తెలుపుతూ వెలువడే - గున్నమావి చివురులు తిన్న కలకోకిల మధుర కంఠపు కూజితమైనా - నావంటి విషమస్థితిలో చిక్కుపడిన ఆడదానికి వెగటుగానే వినిపిస్తుంది అన్నట్లూ -

ఆ విషయం నన్ను మరింత మనోవ్యధకు లోనుచేసిందేగానీ మాతృత్వపు మాధుర్యాన్ని చవిచూసే అవకాశం లభించిందన్న ఆనందాన్ని ఏ కోశానా కలిగించలేదు!

ఒకవేళ నేనూ అందరిలానే మధురోహలతో ఓ శిశువుకు జన్మనిచ్చినా - అందువల్ల నా జీవితం మరింత దుర్భరమయ్యే మాటెలా ఉన్నా నా బిడ్డకూడా బాల్యం నుంచీ నే ననుభవించిన సమస్యల వలయంలోనో చిక్కుపడుతుంది కానీ ఏ ఆధారమూ లేని నా రక్షణలో ఆ దశలో పొందే నైర్మల్యానందాన్ని ఎలా పొందగలదు?

అంటే ఏ చరిత్రనైతే నే అసహ్యించుకుంటున్నానో అలాంటి చరిత్రయే తిరిగి నా బిడ్డద్వారా నే పునరావృతం చేయడానికి ఎలా ఇష్టపడగలను?

పోనీ అందరి స్త్రీల లానే సంసార జీవితం కొనసాగిస్తూ నా బిడ్డ భవిష్యత్‌ను నా ఆశలకు తగ్గ రీతిలో తీర్చిదిద్దాలన్నా నన్నెవరూ ఇప్పుడు భార్యగా స్వీకరించలేరు! అంతకుమించి నా బిడ్డను తన బిడ్డగా అంగీకరించలేరు. ఒకవేళ అంతటి మహోన్నత ఆదర్శంతో నన్నూ నా బిడ్డనూ స్వీకరిం

# నివేదన

చినా ఆ వ్యక్తిని ఈ సంఘం మనశ్శాంతిగా మసలనివ్వదు!

ఇలాంటి స్థితిలో ధైర్యం చేసి నేను ఆ బిడ్డను కన్నా ఆ శిశువు తనకు మహోత్కృష్టమైన మానవ జన్మను ప్రసాదించినందుకు నన్నూ, ఆ భగవంతుడినీ, పూజించడం మాని ద్వేషించడం మొదలెడుతుంది! ఈ ప్రపంచంలో ఏ కన్నతల్లి అలాంటి పరిస్థితిని తట్టుకోగలదు?

కేవలం ఓ మగాడు చేసిన అన్యాయానికి ఇలాంటి విపరీత పరిస్థితుల్లో ఇరుక్కోలేను నేను! సంఘం చుట్టూ సాలెగూడులా అల్లుకుపోయిన అనైతిక విలువలు నన్నలా దిగ్భ్రంధించాయ్ !

కనుక ఈ దేశపు న్యాయమూర్తుల్లారా....

పతనంలో పతాకస్థాయిని చేరుకున్న నైతిక విలువలను పునరుద్ధరించే ప్రయత్నంగా ఈ సభ్య సమాజానికి ఇండియన్ పీనల్ కోడ్‌లోని ఏ సెక్షన్‌ల ఆధారంగా ఎలాంటి శిక్షలు విధిస్తారు? చెప్పండి.... లేకపోతే -

వ్యసనాలంటేనే తెలియనీ.... మంచి మన్ననలే ప్రాణంగా జీవించే మగవాళ్లకు మాత్రమే ఈ సంఘంలో బ్రతికే అర్హతున్నదంటూ వారికి మాత్రమే (అ) సర్టిఫికెట్స్ ఇచ్చి మిగతా వారినందరినీ అండమాన్ జైళ్లకు తరలించేయండి!

లేకపోతే రక్తంలో అణువణువునా దుర్గుణాలు పేరుకుపోయిన ఈ నాగరికులందరిలోనూ ఒక్కసారిగా కాకపోయినా క్రమంగానైనా మంచి మార్పు తేగల సత్తా మీ చట్టాలకు గానీ ప్రభుత్వ శాసనాలకు గానీ ఉందని మీరు గట్టిగా వాదించగలరా?

అలా చట్టాలతోనూ శాసనాలతోనూ మార్పుతేగల సత్తా ప్రభుత్వానికి గానీ వాటి నమలుపరచే అధికారులకు గానీ ఉంటే-జడల మర్రిలా విస్తరించుకుపోతున్న వరకట్నాన్ని గానీ.....వరకట్నపు చావులను గానీ ఎందుకు అదుపు చేయలేకపోతున్నారు?

నాకు జరిగిన అన్యాయాన్ని గొంతెత్తి ప్రశ్నించే హక్కునైనా ఈ భరతభూమి కల్పించింది కనుక నా ఈ 'వేదనా భారాన్ని' మీముందు నివేదిస్తున్నాను!

ఈ సంఘపు నగ్నపు నైజాన్ని అర్థం చేసుకున్నాక భంగపడిన నా జీవితాన్ని నా బిడ్డకోసమైనా నిలుపుకోవడానికి నాకు తోచిన ఒకే ఒక ఆలోచన - తిరిగి ఆ మగవాళ్ల బలహీనతనే ఆధారంగా చేసుకుని కనీసం నా బిడ్డకైనా గొప్ప భవిష్యత్‌ను కల్పించాలనుకోవడం!

అందుకుగానూ త్వరలో మంత్రి పదవిని చేపట్టబోయే మా నియోజకవర్గపు ఎమ్.ఎల్.ఏ. ను నా భాషలో చెప్పాలంటే నా శరీరాన్ని ఎరగా వేసి లోబరచుకున్నాను. అది పెద్ద కష్టమైన పని కూడ కాలేదు నాకు! అప్పుడే తెలిసొచ్చింది మరో విషయం నాకు! అది -

నైతిక విలువలకు తిలోదకాలిచ్చేవాళ్లే ఈ సంఘంలో గొప్ప గొప్ప హోదాలకు త్వరత్వరగా చేరుకోగలుగుతారు!

నా ఆలోచనలు సరైనవి కాకపోవచ్చు! ఎందుకంటే -

నేను మహాత్మాగాంధీకు గానీ మహామేధావి అంబేద్కర్‌కు గానీ వారసురాలిని కాను గనుకా....వారి ప్రభావపు గాలులతో ఊపిరి పీల్చుతూ పెరిగిన దానిని కాను గనుకా!!

చివరిగా నేను మిమ్మల్నికోరేదేమంటే-

వ్యభిచార నేరంపై కోర్టుకొచ్చే స్త్రీల జాలి గొలిపే కన్నీటి కథలనూ వాటి వెనుక దాగి ఉండే ఆర్ద్రతనూ అర్థం చేసుకుని వారలా దిగజారడానికి అన్ని విధాలా కారణభూతుడైన మగవాడి దౌష్ట్యానికి ప్రతిగా అదే నేరంపై కోర్టు కొచ్చే మగవాళ్లనుంచే వాళ్లకు తగిన ఆర్థిక ప్రతిపత్తిని కల్పించి స్వతంత్రంగా బ్రతికే ఏర్పాటు చేసేలా - లేకపోతే మగవాళ్ల మగతనాలను చట్టం ద్వారా హరించే హక్కు కోర్టులకు ఇమిన్ 'ఇండియన్ లా'కు కల్పిగేలా ప్రభుత్వాన్ని వెంటనే శాసనం చేయమంటూ మీరంతా నా ఈ కథ చదివాక సంఘటితమై ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని! నా ఈ కోరిక నెరవేరాలనే నా ఈ సుదీర్ఘ జీవిత చిత్రం!

మంత్రిగారి సేవకు వేళకావడంతో ఇంతటితో సెలవు తీసుకుంటున్నాను!

ఇట్లు,

అభాగ్యురాలినో, అదృష్టవంతురాలినో ఎరుగకపోయినా మగవాడి దౌష్ట్యానికి బలైన అబలగా ఈ సంఘం ముందు నిలువకూడదని కాంక్షించే.... ఓ స్త్రీను !

## గాంధీ - జిన్నా

గాంధీ - జిన్నా ఒప్పందంపై తలపెట్టిన చిత్రం వాస్తవ రూపం దాల్చే అవకాశాలు మృగ్యం కావటంతో ఆ పాత్రలను పోషిస్తున్న బెన్ కింగ్స్‌లే - అలిఖ్‌పదంశీల మధ్య బొంబాయి డైనస్టీ క్లబ్ వాళ్ళు సమావేశం ఏర్పాటు చేశారు అంతా బాగానే జరిగింది కాని చివరిక్షణంలో కింగ్స్‌లే అత్యవసర శస్త్ర చికిత్స కోసం లండన్ వెళ్ళాల్సి వచ్చింది. దాంతో కింగ్స్‌లే క్షమాపణలు కోరుతూ క్లబ్ నిర్వాహకుడికి లేఖ వ్రాశాడట. మరి గాంధీ కోసం జిన్నా వేచివుండక తప్పదుకదా!